క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులకు ప్రవేశం కల్పించి పెద్దమ్మ దర్శనం చేసుకోవడంతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య, చిన్నన్న, చిన్నపెద్దన్న భక్తులకు వసతులను ఏర్పాటు చేశారు. జూన్ 8, 9, 10 తేదీల్లో పెద్దమ్మ దేవర నిర్వహిస్తున్నామన్నారు. అందులోభాగంగా మే 11న ముడుపు కడుతున్నందున ఈలోగా ఏమైనా మొక్కులు ఉంటే చెల్లించుకోవాలన్నారు.

శ్రీశైలంలో భక్తుల సందడి

- వరుస సెలవుల నేపథ్యంలో పెరిగిన భక్తులు


మల్లన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వరుస సెలవులతోపాటు అమ్రాబాద్ వద్ద సలేశ్వరం జాతర ఉండటంతో భక్తులు భారీగా తరలివస్తున్నారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొంది స్వామివారి స్పర్శ దర్శనం నిర్వహించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల వాహనాల రాకపోకలతో ముఖద్వారం నుంచి టోల్‌గేట్ వరకు వాహనాల రద్దీ ఏర్పడింది.

కారు - లారీ ఢీ

- ఐదుగురికి గాయాలు

జూపాడుబంగ్లా: స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం కారు – లారీ ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. ఎస్ హెచ్ 340సీ రోడ్డుపై తంగడంచ గ్రామ సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద కర్ణాటక నుంచి శ్రీశైలం వెళ్తున్న కారు, విజయవాడ నుంచి పచ్చిటెంకాయలతో ఆదోని వెళ్తున్న ఆల్విన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆల్విన్ డివైడర్‌ను ఢీకొని బోల్తాపడగా కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. ఆల్విన్ డ్రైవర్ లక్ష్మణ్, కారు డ్రైవర్ ధనుంజయ, కారులోని ఓ మహిళ ఇద్దరు పిల్లలకు గాయాలవ్వగా వారిని 108లో నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రోడ్డు సేఫ్టీ పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని ఆల్విన్, కారును తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

బైక్‌లు ఢీ

తర్తూరు నుంచి వస్తున్న ఓ బైక్, తర్తూరులోకి వెళ్తున్న మరో బైక్ ఎదురెదురుగా ఢీకొనటంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. నందికొట్కూరుకు చెందిన వలి, కడుమూరుకు చెందిన అజయ్ బైక్‌లపై ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరికీ కాళ్లు, చేతులు విరగటంతో వారిని 108లో నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉపాధి కూలీలకు బీమా వర్తింపజేయాలి


జీపుజాతాలో నాయకులు

బండి ఆత్మకూరు: ఉపాధి కూలీలకు ప్రమాద బీమా వర్తింపజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివ నాగరాణి, మండల కార్యదర్శి డేవిడ్ డిమాండ్ చేశారు. ఆదివారం చిన్న దేవళాపురం, నారాయణాపురం, సంత జూటూరు, పెద్ద దేవళాపురం, ఈర్నపాడు, బండిఆత్మకూరు, కడమల కాలువ గ్రామాల్లో జీపు జాతా నిర్వహించారు. కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 కనీస వేతనం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల న్యాయమైన డిమాండ్ల కోసం ఈనెల 15న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు పెద్ద ఎత్తున తరలి రావాలని కూలీలకు సూచించారు.

అమ్మవారికి పల్లకీ సేవ


పల్లకీలో స్వామిఅమ్మవారలు

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.

పది తర్వాత..?

- విద్యార్థుల్లో సందిగ్ధం
- తల్లిదండ్రులు, టీచర్లు చొరవ చూపాల్సిన సమయం
- ఇంటర్‌లో గ్రూపుల ఎంపికే కీలకం
- సరైన ప్రణాళికతో ఉజ్వల భవిష్యత్


చదువుకుంటున్న విద్యార్థులు(ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): పది పరీక్షల ఫలితాలు త్వరలో రానున్నాయి. పరీక్షలు రాసిన విద్యార్థుల్లో పది తరువాత ఏం చదవాలి.. ఇంటర్‌లో ఏ గ్రూపు తీసుకోవాలి? ఏ గ్రూపు తీసుకుంటే కెరీర్ బాగుంటుంది? ఎవరిని అడగాలి? అనే సందేహాలు వారిని వెంటాడుతున్నాయి. ఉన్నత విద్యకు వారధిలాంటి ఇంటర్మీడియెట్‌లో గ్రూపును ఎంచుకోవడమే అత్యంత కీలకం. విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా, ఇష్టమైన సబ్జెక్టుపై దృష్టి సారించాలని, అప్పుడే ఉన్నత స్థాయికి చేరుకోవడానికి సులభతరమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు అందజేసే వివిధ గ్రూపులు, వాటి వివరాలు..

ఎంపీసీ ...

ఇంజినీరింగ్ వృత్తిలో స్థిరపడాలనుకునే వారు తీసుకొనే గ్రూపు ఎంపీసీ. రాష్ట్రంలో ఎంసెట్ రాయాలనుకునేవారు, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్స్, ఏరో నాటికల్స్ తదితర రంగాల్లో ఇంజినీరింగ్ చేయాలనుకొనే వారికి ఎంపీసీ గ్రూప్ పునాది వంటిది. బిట్స్‌పిలానీలో ప్రవేశానికి జరిగే బిగ్శాట్ రాసేందుకు ఎంపీసీ విద్యార్థులు అర్హులు.

బైపీసీ...

వైద్య సంబంధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడాలనుకున్న వారు బైపీసీ వైపు దృష్టి సారించవచ్చు. అగ్రికల్చర్ గ్రూపులకు ఈ గ్రూప్ ప్రాతిపదిక ఓపిగ్గా చదవడం, స్పష్టంగా బొమ్మలు గీయగలగడం ఈ గ్రూప్ విద్యార్థులకు ఉండవలసిన లక్షణాలు.

పాలిటెక్నిక్...

పదవ తరగతి తరువాత ఏదైనా సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించి ఉపాధి పొందాలంటే ఉత్తమ మార్గం పాలిటెక్నిక్. దీనికోసం విద్యార్థులు పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ సెట్ (పాలిసెట్) ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

ఎంఈసీ, సీఈసీ...

సైన్స్, ఆర్ట్స్ గ్రూపులపై పెద్దగా ఆసక్తి లేనివారు, సేవారంగం వైపు వెళ్లేవారు ఎంఈసీ లేదా కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్, సబ్జెక్టులున్న సీఈసీ గ్రూపులో చేరవచ్చు. చార్టర్డ్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు, కమర్షియల్ ఏజెంట్లు, బ్యాంక్ మేనేజర్ వంటి ఉద్యోగాలు స్థిర పడాలనుకునేవారు, స్టాక్ మార్కెట్లలో ఉద్యోగాలు కావాలనుకున్న వారు ఈ గ్రూపును ఎంపిక చేసుకోవచ్చు.

ఐటీఐ...

ఇండస్ట్రీయల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ కోర్సులను ఎంచుకోవడం ద్వారా విద్యార్థి పదవ తరగతి తరువాత రెండేళ్లలో సాంకేతిక విద్యలో నైపుణ్య సాధించవచ్చు. దీనివల్ల చిన్న వయస్సులోనే ఉపాధి పొందే అవకాశం ఉంది. పరిస్థితులు అనుకూలిస్తే సాంకేతిక విద్యారంగంలో ఉన్నతస్థాయి విద్యాకోర్సులు చేయవచ్చు.

ఫలితాలొచ్చాక నిర్ణయించుకోండి



కంగారుపడి నిర్ణయాలు తీసుకోకూడదు. తల్లిదండ్రులు చొరవ చూపి పిల్లలకు సరైన కోర్సును సూచించాలి. ఫలితాలు వెలువడక ముందే నిర్ణయాలు తీసుకోకుండా ఫలితాలొచ్చిన తరువాత ఏ సబ్జెక్టులో ప్రావీణ్యం, ఆసక్తి ఉందో దాని ఆధారంగా కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– శంకర్‌ప్రసాద్, ఉప విద్యాశాఖ అధికారి, నంద్యాల

ఒకరిని చూసి ఎంచుకోవద్దు



ఆలోచించి నిర్ణయం తీసుకొని ఆ లక్ష్యంతో కోర్సును ఎంపిక చేసుకొని చదవాలి. ఒకరిని చూసి మరొకరు. పోటీపడి కోర్సులను ఎంపిక చేసుకుంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. తద్వారా కెరీర్ పాడు చేసుకుని చదువును మధ్యలో నిలిపేసి, అమ్మా, నాన్న ఆశలకు గండికొట్టవద్దు.

– చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్, నంద్యాల

ఇష్టమైన సబ్జెక్టు ఎంచుకోవాలి



కష్టమైన సబ్జెక్టు కాకుండా ఇష్టమైన సబ్జెక్టును ఎంచుకుంటే ఒత్తిడి లేకుండా చదువుకోవచ్చు. ఎవరో చెప్పారని ఇష్టం లేని గ్రూపు తీసుకొని ఒత్తిడికి గురై భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దు. చదువుతో పాటు క్రీడారంగంలో రాణించేందుకు ప్రయత్నించాలి. – కేవీ సుబ్బారెడ్డి, నంద్యాల

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి సప్లిమెంటరీ, రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ ఫీజులను తగ్గించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఇంటర్ బోర్డు అధికారులు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు ఫీజులను తగ్గించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సిద్దార్థ, ప్రవీణ్, మల్లికార్జున, వీరసింహారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

వాసుదేవరావు ఆశయ సాధనకు ఉద్యమిద్దాం

నంద్యాల(న్యూటౌన్): సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సీనియర్ నేత పైలా వాసుదేవరావు ఆశయ సాధనకు ఉద్యమించాలని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎం.శంకర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఆటో యూనియన్ కార్యాలయంలో పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సభను నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం రైతాంగ సాయుధ పోరాట యోధుడు అజ్ఞాత సూర్యుడు పైలా వాసుదేవరావు విద్యార్థి దశ నుంచి విప్లవ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు కలాం, డెమోక్రసీ పార్టీ నాయకులు చౌడప్ప, రాజు, లక్ష్మణ్, సురేష్, వెంకటేశ్వర్లు, యాకూబ్, రఫీ పాల్గొన్నారు.


విగ్రహాలు, ధ్వజ స్తంభానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠోత్సవాలు


గ్రామోత్సవంలో చెక్క భజన చేస్తున్న కళాకారులు

రుద్రవరం: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న దొర్వి చెంచులక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద ప్రతిష్ఠోత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం వేద పండితులు ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల హోమాది పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజ స్తంభం, విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. కళాకారులు డ్రమ్స్, చెక్క భజనల మధ్య గ్రామోత్సవం వైభవంగా సాగింది. సోమవారం విగ్రహాలు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.


జాతీయ అవార్డు అందుకున్న వీరయ్య, రవీంద్రనాథ్



అంబేడ్కర్ మార్గం ఆదర్శం

నంద్యాల(న్యూటౌన్): లౌకిక, రాజ్యాంగ పరిరక్షణే అంబేడ్కర్ మార్గమని, అదే మనందరికీ ఆదర్శమని శ్రీగురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ దస్తగిరి రెడ్డి, డైరెక్టర్ షేక్షావలిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ గురురాజ ఇంగ్లీష్ మీడియం తెలుగు పండిట్, కో ఆర్డినేటర్‌గా పని చేస్తున్న వీరయ్యకు జాతీయ స్థాయి అంబేడ్కర్ ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. గుంటూరు మాజీ శాసన మండలి సభ్యులు లక్ష్మణరావు, డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగయ్య చేతుల మీదుగా జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకోవడం అభినందనీయమన్నారు. అలాగే.. అంబేడ్కర్ జాతీయ అవార్డు అందుకోవడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందని బాలా అకాడమీ విద్యాసంస్థల చైర్మన్ రవీంద్రనాథ్ అన్నారు. గుంటూరులో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒకరోజు ముందుగానే అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ


బహుమతులు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

నంద్యాల(వ్యవసాయం): శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని బొమ్మలసత్రం సాయిబాబా గుడిలో రామాయణం మహాకావ్యం అవగాహన పోటీ పరీక్షల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ రామకృష్ణారెడ్డి, కొమ్మచెరువు ఆంజనేయస్వామి దేవస్థానం అధ్యక్షుడు మల్లినాథ సూరి హాజరై మాట్లాడారు. పిల్లల్లో చదువుతో పాటు ఆధ్యాత్మిక కథలను, ఇతిహాసాలను, పురాణాలను తెలియజేయడంతో జ్ఞానంతో పాటు మేధస్సు పెరుగుతుందన్నారు. నిర్వాహకులు మంజునాథరావు మాట్లాడుతూ మార్చి 23న జిల్లా వ్యాప్తంగా 70మంది విద్యార్థులు, పెద్దలు పరీక్షల్లో పాల్గొన్నారన్నారు. మొత్తం 200 మార్కులకు పరీక్షలు నిర్వహించగా పావని, ఆశాజ్యోతి మొదటి బహుమతి సాధించగా కోవెలకుంట్లకు చెందిన రుక్సానా రెండో బహుమతి ఇలియాస్ హుసేన్ మూడవ బహుమతి సాధించారని వివరించారు.

సత్తా చాటిన ప్రభుత్వ కళాశాల


విద్యార్థులతో అధ్యాపకులు

ఆళ్లగడ్డ: ఇంటర్ ఫలితాల్లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైపీపీఎం జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి సత్తాచాటారు. ఎంపీసీ గ్రూపులో వెన్నెల 976, సంజయ్ స్వరూప్ 939 మార్కులు సాధించారు. బైపీసీలో సుజాత 866, ఆర్ట్స్ గ్రూపులో శ్వేత 768, అఖిల 750 మార్కులు సాధించగా.. జూనియర్ ఎంపీసీలో అఖిలాండేశ్వరి 442, ఆఫీయా తబసుమ్ 432, బైపీసీలో మౌనిక 411, హిమశ్రీ 410 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఉయ్యాలవాడ: మండల పరిధిలోని హరివరం గ్రామ సమీపంలో కుందూనది ఒడ్డున పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. కోవెలకుంట్ల మండలం గుళ్లదుర్తి గ్రామానికి చెందిన ముగ్గురు, ఉయ్యాలవాడకు చెందిన మరో వ్యక్తి పేకాట ఆడుతుండగా వచ్చిన సమాచారంతో సిబ్బందితో వెళ్లి అరెస్ట్ చేశామని ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ.9,150 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

నంద్యాల(అర్బన్): మండలంలోని పెద్దకొట్టాల గ్రామ మాజీ సర్పంచ్ జయపాపిరెడ్డి ఆదివారం మృతి చెందాడు. ఇటీవల గొర్రెల షెడ్డులో జరిగిన ప్రమాదంలో గాయపడ్డ జయపాపిరెడ్డి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, పలువురు నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మేడేను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): కార్మికులంతా ఏకమై మేడేను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఘురామ్మూర్తి, సుంకయ్య, ఉమ్మడి జిల్లాల మాజీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మురళీధర్ కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికుల రక్తంతో తడిసిన ఎర్రజెండాగా వీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ మేడేగా మే 1వ తేదీని జరుపుకుంటున్నామన్నారు. నంద్యాల జిల్లాలో సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. రంజిత్, సుశీలమ్మ, నాగేశ్వరరావు, ఏలియా, ఆశీర్వాదం, కాశమ్మ, ఈశ్వరమ్మ, సుబ్బమ్మ, ఆటో యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

డీఏ అరియర్స్ ఎప్పుడో?

- ఉద్యోగుల ఎదురుచూపులు

మహానంది: డీఏ అరియర్స్ చెల్లించాలని దేవస్థానం ఉద్యోగులు కోరుతున్నారు. మహానందిలో సుమారు 55 మంది రెగ్యులర్ ఉద్యోగులున్నారు. వీరికి గత ఏడాది డీఏ అరియర్స్ గత ప్రభుత్వ హయాంలోనే మంజూరైనా నేటికీ చెల్లించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. శివరాత్రి కానుకగా పాత బకాయిలు విడుదల చేస్తారని ఆశగా ఎదురు చూసిన ఉద్యోగులకు నిరాశే మిగిలింది. నూతన తెలుగు సంవత్సరాది ఉగాదికైనా వస్తుందంటే అదీ రాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం ఈ నెలాఖరులోగా అయినా విడుదల చేస్తే తమ పిల్లల చదువుల ఖర్చులకు ఉపయోగపడుతుందని పలువురు కోరుతున్నారు. కాగా శ్రీశైలం, ఇతర ప్రముఖ ఆలయాల్లో డీఏ బకాయిలు గతంలోనే విడుదల చేసినట్లు సమాచారం. ఏటా ఆర్థిక సంవత్సరం మార్చితో ముగుస్తుంది. మార్చి బడ్జెట్‌లోనే చెల్లించాల్సి ఉన్నా ఆదాయం తక్కువగా చూపినవారమవుతామనే కారణంతో ఉద్యోగుల డీఏ అరియర్స్ నిలిపినట్లు విశ్వసనీయ సమాచారం. వచ్చే నెల చెల్లించనున్నారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

వ్యక్తి అదృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని కనుమకింది కొట్టాల గ్రామానికి చెందిన బిల్ల రమేష్ శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో భార్య బిల్ల లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య తెలిపారు.

కేసీకి నీటి విడుదల బంద్

పాములపాడు: ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కెనాల్‌కు నీటి విడుదల నిలిపి వేసినట్లు ఏఈ శ్రీనివాసనాయక్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేసీ కెనాల్ పరిధిలో పైర్లకు నీటి అవసరం లేనందున నీటి విడుదల నిలిపివేశారు. కాగా వేసవిలో ప్రజలకు త్రాగు నీటి అవసరాల కోసం కేసీ కెనాల్ 120వ కిలోమీటర్ లాకిన్స్‌లా వద్ద సుమారు 2,000 క్యూసెక్కుల నీటిని నిల్వ చేశామన్నారు.

క్రీస్తు బాటలో నడవాలి

- ఘనంగా మట్టల ఆదివారం


హోలీక్రాస్ కెథడ్రల్ ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న గురువులు


దైవసందేశమిస్తున్న డీనరీ చైర్మన్ ఇమ్మానియేల్

నంద్యాల(న్యూటౌన్): ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో నడవాలని హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-2 చైర్మన్ ఇమ్మానియేల్, పాస్టరేట్-1 డీనరీ చైర్మన్ కొత్తమాసి జోసెఫ్, పాస్టరేట్-3 డీనరీ చైర్మన్ నందం ఐజక్, ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ప్రసన్నకుమార్ అన్నారు. మట్టల ఆదివారం సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం, హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1, పాస్టరేట్-2, పాస్టరేట్-3 మత్తయ్య ఆలయం, బాప్టిస్ట్ రక్షణాలయంతో పాటు పట్టణంలో అన్ని క్రైస్తవ సంఘాల్లో పామ్ సండే ఘనంగా నిర్వహించారు. మట్టలు చేతపట్టుకొని దేవున్ని స్తుతిస్తూ, ప్రత్యేక పాటలు పాడుతూ ఆలయాల చుట్టూ ప్రత్యేక ప్రదక్షిణలు చేశారు. భస్మ బుధవారం మొదలుకొని ఈస్టర్ పండుగ వరకు క్రైస్తవులు ఉపవాసాలతో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తారు. మట్టల ఆదివారం ప్రార్థనతో పాటు గుడ్‌ఫ్రైడే ముందు రోజు మహాబేస్తవారం సాయంత్రం ప్రార్థనలు నిర్వహిస్తారు. పాస్టర్లు విజయ్‌కుమార్, జోయెల్, డానియేల్‌పురం పాస్టరేట్ కాంతరావు, టెక్కె పాస్టరేట్ చైర్మన్ సుమిత్రబాబు, పాల్‌రాజారావు, సీయెను ప్రార్థనామందిరం నిర్వాహకులు ఏసుదాసు, వైఎస్సార్‌నగర్ క్రిస్టియన్ అసెంబ్లీ నిర్వాహకులు పోలుగారి జయరాజు, రాజారావు, ఏసుకృప పాస్టర్ అందం సుధాకర్, జాన్‌బెన్ని క్రీస్తు సందేశమిచ్చారు. అలాగే మండలంలోని మిట్నాల సీఎస్ఐ ఆలయంలో పాస్టర్ కాంతరావు, సంఘ కాపరి జాకోబ్‌లతో పాటు అయ్యలూరు, గుంతనాల, చాపిరేవుల, పెద్దకొట్టాల, తదితర గ్రామాల్లో మట్టల ఆదివారపు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం


మట్టలు పట్టుకుని ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

దొర్నిపాడు: మండలంలో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. యేసుక్రీస్తు మరణానికి ముందు జెరుషలేము సందర్శించేందుకు గాడిదపై వెళ్తుండగా ప్రజలంతా విజయోత్సాహంతో నేలపై తమ వస్త్రాలను పరిచి కర్జూరపు మట్టలు చేతబూని స్వాగతం పలికారని, అందుకే ఏటా ఈస్టర్‌కు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా జరుపుకోవడం ఆనవాయితీ. దొర్నిపాడు, క్రిష్టిపాడు, డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె, గుండుపాపల, బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల గ్రామాల్లో ఉదయమే చర్చిలకు వెళ్లి మట్టలు పట్టుకుఎని ప్రార్థనలు చేశారు.

- చాగలమర్రి: మండలంలో మట్టల పండుగను క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. స్థానిక ఆర్‌సీఎం, సీఎస్ఐ, మార్థోమా, ముత్యాలపాడు ఎస్‌పీజీతో పాటు గ్రామాలలోని చర్చిలలో ఆదివారం మట్టల పండుగను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఫాదర్ రెవ ఆర్ఏఈ సంజీవరాజ్ పండుగ విశిష్టతను వివరించారు. ఏసు ప్రభువు ఈస్టర్‌కి ముందు ఆదివారం జెరుషలేముకు వచ్చారని, అప్పుడు ఏసుప్రభువుకు ప్రజలు ఈత మట్టలతో స్వాగతం పలికారని తెలిపారు. అందుకు గుర్తుగా మట్టల ఆదివారం నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ఫాదర్‌లు సంపత్ కుమార్ ఆనంద్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దబోధనం గ్రామంలో ఈత మట్టలతో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మీరంగనాథుడికి భక్ష్యాల నైవేద్యం


స్వామివారి దర్శనానికి భక్ష్యాల బండ్లతో తరలివచ్చిన రైతులు


భక్తులను ఆశీర్వదిస్తున్న లక్ష్మీరంగనాథస్వామి

తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు శనివారం రథోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారు దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి అపురూపమైన దివ్యమంగళరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. రైతులు భక్ష్యాలబండ్లు కట్టుకొని వచ్చి స్వామివారికి వారి పొలాల్లో పండిన దాన్యంతో పాటు బియ్యం, కందిబేడలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది వర్షాలు సంపూర్ణంగా కురిసి సాగుచేసిన పంటలు సమృద్ధిగా పండాలని రైతులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు స్వామివారి దివ్యరూపాన్ని కనులారా దర్శించుకుని తరించిపోయారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు, మాజీ ఎమ్మెల్యే లబ్బివెంకటస్వామితో పాటు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

– జూపాడుబంగ్లా